# పిల్లలందరు గొల్లుమన్నారు

శ్రీ సిద్ధాంతి మల్లికార్జునం

నేనెరిగినప్పటినుండి స్థానికపరిపాలనంటే తాతాచార్లుగారు చాలా అభిమానం చూపుతూండేవారు. మా వూళ్ళో పంచాయితీబోర్డు ఎన్నికలప్పుడుగాని, జిల్లాబోర్డు ఎన్నికలప్పుడుగాని వారి ఉత్సాహం, వారి ఉపన్యాస ధోరణి విని చూచి ఆనందించాల్సిందేగాని, రెండో నోటిసుండా వింటే ఉపయోగమే లేదు. అసలు పూర్వకాలంలో మనదేశం అంత గొప్పదిగా వుండటానికి కారణం స్థానిక పరిపాలనాసంస్థలేనని, యిప్పుడు ఆ దేశమే పతనం చెందటానికి ఆ సంస్థల వ్యాప్తి లేకపోవడమేనని వారి దృఢ నమ్మకం.

ఏ గొప్ప పొరపాటువల్లనో గ్రహస్థితిలో కొద్ది స్థానచలనం కలగడంచేతనే గాని లేకపోతే వారేదో ఒక గొప్ప దేశభక్తుడై మహానాయకుడై మహోగ్రభీకరోపన్యాసాలిచ్చి ప్రచండ ప్రచారంచేసి భూమ్యాకాశాలను దద్దరిల్లేట్లుచేసి ప్రజల హృదయాలను ఊపిరి తిప్పుకోకుండా ఊపి, ఊపి, చిట్టచివరకు సామదానభేద దండోపాయాలతో, రాష్ట్రీయ పరిపాలనాధికారాలలో లాభదాయక గౌరవనీయ, అనంతాధికార యుతమైన, స్థానిక పరిపాలనాశాఖామాత్యులుగా పీఠమలంకరించి వుండేవారు.. కాని ప్రారబ్ధాన్ని బ్రహ్మదేముడే ఎదిరించలేకపోతే యిక తాతాచార్లగారి మాటేమిటి ?

ఎలాగైతేనేం, జాతకప్రభావంవల్ల వారు మా జిల్లాబోర్డు ఉపాధ్యాయులైనారు. భూగోళం, దేశచరిత్ర, సాంఘిక వ్యవస్థ, ఆర్థికస్థితి మొదలైన విషయాలలో వారికిగల అనన్యసామాన్య విజ్ఞాన శ్రద్ధాసక్తుల కారణంగా, నిన్నగాక మొన్ననే కొత్తగా సాంఘిక విజ్ఞానము అని నామకరణం చేసుకున్న, కొత్తచదువు బోధించడానికి వారిని, నియమించారు

అసలు పుస్తకంలో ఏది వున్నప్పటికీ స్థానికసంస్థల గురించి ఏదో ఒక అంశం చెప్పనిదే తాతాచార్లుగారు క్లాసువదిలిపెట్టేవారుకాదు. గంటకొట్టినా ఒక్కొక్కసారి ఉపన్యాసంలో మునిగి, అలాగే చెపుతూంటారు. సాయంకాలం బడి వదిలిపెట్టాక, యింటికి వెళ్లేంతవరకు కోడిపెట్టలాగా, ఒక డజను విద్యార్థులను వెంటబెట్టుకొని, మా జిల్లాబోర్డువేసిన రోడ్లను గురించో, పంచాయితీబోర్డు గుడ్డిలాంతర్లను గురించో, రోడ్డుకు అడ్డంగా ప్రవహించే మురికికాలువల గురించో చెప్పుకుంటూ వెళ్లేవాడు. ఈ చెప్పిందంతా చాలక, ఎవరైనా సరే ఎప్పుడొచ్చినాసరే, తాను తప్పకుండా, మౌర్యరాజుల కాలంలోగాని చోళ రాజుల కాలంలో గాని స్థానిక పరిపాలననుగురించి విశదంగా చెప్తానని వాగ్దానంచేసి వాళ్ళను యింటికి పంపేవారు.

తాతాచార్లుగారి ధర్మాన స్థానికసంస్థలు వాటి పరిపాలన, ప్రతిభ, మొదలైన విషయాలన్నీ పిల్లల తలనిండా నిండిపొయ్యాయి. పరీక్షల్లో ఏ ప్రశ్న అడిగినా, స్థానికసంస్థలగురించే వ్రాసేటంతటివరకు వచ్చారు విద్యార్థులందరు.

ఒకనాడు హైస్కూలు వార్షిక దినోత్సవం జరిగింది. ఉదయంనుంచి రాత్రి 8 గంటలవరకు కార్యక్రమాలు పూర్తిగా వున్నాయి. నాటిసభకు జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారు ప్రెసిడెంటుపదవి నలంకరించారు. సభలో ఉపన్యసించేవారిలో తాతాచార్లుగారు ఒకరు. వారి వంతు వచ్చేసరికి ఆచార్లుగారు ఉత్సాహం పట్టలేకపొయ్యారు. ఆ ఉత్సాహంలో అందులో జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారిని చూచాక ఉబికే ఉత్సాహంలో వారేమైపోతారో, కాస్త పెద్దసంసారం కలిగినవారేనని నాకు జాలేసింది.

ఎన్నడూ అలా ఉపన్యసించలేదు తాతాచార్లుగారు స్థానికసంస్థలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకన్నా ఎక్కువగా దేశానికవసరమన్నారు. అసలు కొద్దిరోజుల్లో పంచాయితీబిల్లు రాగానే, పంచాయితీరాజ్యం మనదేశంలో స్థాపితమైతే, స్థానిక సంస్థల యొక్క అధికారాలు గౌరవాలు ఎక్కువౌతాయని, అలాంటప్పుడు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు మనదేశంలో స్థానమే లేదని ఆచార్లుగారు అతి గంభీరోపన్యాసం చేశారు.

వారి ధోరణిలో మా జిల్లాబోర్డు, పరిపాలనా సౌష్ఠవంలోగాని, ఆర్థిక సౌష్ఠవంలోగాని ఉపాధ్యాయుల మార్పు విషయాల్లోగాని మరి ఏ జిల్లాబోర్డుకుగాని తీసిపోదని మాట్లాడితే ఏ విషయంలోనైనా తక్కిన వాటికంటే రెండుమెట్లు వృద్ధిలోనేవుంటుందని, యిన్నిటికిమా జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారి నిష్కల్మషమైన విశాల విశ్వంలాంటి హృదయమే కారణమని ముగించారు.

*  *  *  *

"ఏమండీ యిది ఫిబ్రవరినెలకదూ ?" అన్నది తాయారమ్మ భర్తని.

"అవును."

"ఇవ్వాళ 25 వ తారీఖుగదూ ?"

"అవును."

"బళ్లో మీటింగు బాగా జరిగిందా ?"

"చాలా బాగా జరిగింది. ఇవ్వాళ, చెప్పిన ఉపన్యాసం నాజన్మలో ఎన్నడూ చెప్పలేదు. మా ప్రెసిడెంటుగారు కూడ చాలాసేపు చప్పట్లు చరిచారు."

"అబ్బా !!"

"మీటింగు తర్వాత నా ఉపన్యాసం చాలా బాగుందని మెచ్చుకోలేక చాలా అవస్థపడ్డారు......ఫరవాలేదులే. ఆయన చాలా సంతోషపడ్డారు. అదే పదివేలు... ఈసారైనా జీతం ఎక్కువ చెయ్యకపోతారా ?

"ఏం నామొహమో !...ఎంత సేపటికీ మీ ఉపన్యాసాల మోతేగాని రూపాయల మోత వినబడితేగా !"

"కాస్త ఓపిక పట్టవే... ఎలాగైనా మనం నోటితో బతకవలసినవాళ్లం. దేనికైనా కాలం కర్మం కూడి రావాలా ?"

"కాలానికి కర్మకూ కొరవేలేదు... ఒక్క కూడు గుడ్డ యీ రెంటికి తప్ప మరోదానికి మనకేమైనా కొరవా చెప్పండి ...పచ్చగా యింటినిండా పదిమంది పిల్లలు, ఎప్పుడు వచ్చేపొయ్యేవాళ్లు గొప్ప ఉపన్యాసకులని మీకు పేరు మీ భార్యవని నాకు పేరు__"

"నిజమేలేవే."

"ఇంతకూ జీతా లెప్పుడొస్తాయట ?"

"చెక్కు రేపు వస్తుందంటున్నాడు మా హెడ్మాస్టరు......చాలా రోజులక్రిందటే చెక్కులమీద సంతకాలుపెట్టి పంపించినట్లు ప్రెసిడెంటు రాత్రి చెప్పాడట."

"మరింత ఆలస్యం దేనికి ?"

"బహుశః యీ ఎలెక్షన్ల హడావిడి

కాబోలు. దాంటో మునిగి మా జీతాల మాటే మర్చిపోయ్యారు."

"అయితే మీ ప్రెసిడెంటు గెల్చాడా?"

"ఆహాఁ. ఆయన గెలవకపోవడమేమిటి?...పైగా నేను ప్రచారానికి వెళ్లడం!"

"ఆయన గెలిస్తే మీకేం ఒరుగుతుందని చేశారు యీ చాకిరంతా?"

"ఒకనెలజీతం బోనస్ గా యిప్పిస్తానన్నాడు."

"నిజంగా?"

"తప్పక...మాట తప్పే మనిషి కాదు. మా ప్రెసిడెంటు."

"రేపు జీతం వస్తే ఒక్క చీరైనా కొని పెడ్తారా?"

"సరే...నాకూ పంచలన్నీ చినిగిపొయ్యాయి...బడికి పోవడానికే సిగ్గుగా వుంది...చక్కగా అలంకరించుకొని ముచ్చటగా వుండేపిల్లల ఎదుట యీ చింపిరి వస్త్రాలతో వెళ్లి పాఠం చెప్పాలంటే నాకు తలవంపులుగా వుంటూంది."

* * * *

"ఏమేవ్"

"ఆఁ"

"చెక్కు వచ్చిందట."

"అబ్బ!!...ఎన్నాళ్లకు విన్నానండీ యింత మంచివార్త...మరి యివ్వాళే యిస్తారా."

"ఇంకా ఆలస్యమా?"

"ఎంత రావాలి మీకు?"

"మూడు నెల్లజీతం, ఒక నెల బోనస్. 240 రూ. రావాలి."

"ఇంత సంతోషం ఎన్నడూ కలగలేదండి.

"సరేలే బడికి గంటైంది...అన్నం పెట్టు"

"అప్పుడే!...తొమ్మిదిన్నర కూడా కాలేదే."

"జీతాలిచ్చే రోజు గదటే...ఇవ్వాళైనా కాస్త పెందలాడే వెళ్లకపోతే ఎలాగే?"

"అయినమటుకు పెడతారండి."

* * * *

"ఒరేయ్ ఖాదర్"

"అయ్యా."

"చెక్కు వచ్చిందటగా.. ఖజానాకింకా వెళ్ళలేదా?"

"ఇప్పుడే పోతుండానయ్యా"

ఆమాట చెవిలో వేసుకొని పొంగిపొరలే చిరునవ్వు నాపుకుంటూ తాతాచార్లుగారు క్లాసులో ప్రవేశించారు.

"ఇవ్వాళ జీతాలు వస్తాయటగదండీ" అన్నారు పిల్లలు.

"రేడియోవార్తల్లో ఏమైనా విన్నారట్రా?"

"మన వూళ్లో దోమ యీనినా వూరంతా తెలుస్తుంది సార్."

"సరే లెండి."

అంటూ పుస్తకం తీసుకున్నాడు. సగం టైమైంది. హఠాత్తుగా తాతాచార్లుగారబ్బాయి చక్కగా క్లాసులోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏమిట్రా యిక్కడికొచ్చావు?"

"నాన్నా, చిన్నత్త, మామ, పిల్లలు అంతా యీ బండికే వచ్చారు."


"ఓహో...సరే...యింక వెళ్లు."

* * *

సాయంకాలం ఆఖరు పీరియడ్ జరుగుతూంది. ఇన్నాళ్లకుగా చెల్లెలు, బావగారు, పిల్లలు వచ్చారంటే తాతాచార్లు చాలా సంతోషపడుతూ ద్విగుణీకృతోత్సాహంతో పాఠం చెబుతున్నారు.

ఆనాడు జిల్లాబోర్డు ప్రెసిడెంటు అధికారాలు చెప్పవలసివచ్చింది. వారికది చాలా యిష్టమైన పాఠం. అందుచేత గంభీరోపన్యాసం చేస్తున్నాడు.

(38_వ పేజీ చూడండి)





"నేనేమైనా దయ్యాన్నా; భూతాన్నా? నువ్వు ఆ వరసను ఏడుస్తుంటే నే నెట్లా ఫోటోతీసి ఏడ్చేది?"

# పిల్లలందరు గొల్లుమన్నారు

(17-వ పేజీ తరువాయి)

"తగలబడ్డట్టేవుంది నీ జిల్లా బోర్డు" అంటూ పేరయ్యశాస్త్రిలు క్లాసులోకి దూరాడు. క్షణకాలం అందరు చకితులైనారు. పేరయ్యశాస్త్రిలుగారి మాటలు బాగా ఎరిగినవా రవడంచేత తాతాచార్లు ఏమీ ఆశ్చర్యపడలేదు.

"డబ్బు తెచ్చాడా."

"నా మొహం తెచ్చాడు."

"ఇదేం కర్మ!"

"జిల్లాబోర్డు అక్కౌంటులో, దమ్మిడీ కూడా లేదట." అన్నాడు శాస్త్రిలు నిలువున దహించుకొపొయ్యే కోపంతో. ఆ మాట విని పిల్లలందరు గొల్లుమన్నారు.

★

# విజ్ఞాన వీధులు

(35-వ పేజీ తరువాయి)

గూడు చిదిపి పరీక్షచేసి యుంటే వారికి అసలు సత్యము అవగాహన అయివుండును.

## 4. మొసలి జీవకారుణ్యం

ఎంత కారుణ్యం లేకపోతే, నోట్లోకి - రెండు దవడలూ కలిసే చోటికి సరిగ్గా పళ్ల మధ్యకి-తనంతట తానే ప్రవేశించిన పిట్టని కరకరా నమిలేయకుండా మిగులుస్తుంది మొసలి? పులినోటి కండ తప్పి బయట పడిందని ఎప్పుడేనా విన్నారా మీరు? మొసలి నోట్లో దూరిన పిట్టమాత్రం నిరపాయంగా బయటికి వచ్చి ఎగిరి పోతుంది. ఎప్పుడో తప్పిజారి ఒక్కమాటు కాదు. మొసలి నోరు తెరచుకుని గట్టుమీద పడుకున్నప్పుడల్లానూ!

మొసలి ఉభయచరం. రాత్రంతా నీళ్ళల్లోనే తిరుగుతూ, నీటిపక్షుల్ని, దప్పి తీర్చుకోడానికి వచ్చిన జంతువుల్ని సడిలేకుండా పట్టుకుని నీటి అడుక్కి లాగుకుపోయి నమిలి వేస్తుంది. బురద నీటిలో ఎప్పుడూ వుండే జలగలు ఈ అవకాశాన్ని దొరక బుచ్చుకుని మొసలి దవడల్లో దూరి పళ్ల యిగుళ్లని పట్టి నెత్తురు పీలుస్తాయి. వీటిని వదిలించుకోడానికి సాధనాంతరం లేక పగటిపూట నీటికి చేరువగా గట్టుమీద నోరు తెరుచుకుని పడుకుంటుంది మొసలి. ట్రోకిలస్ * అనే పిట్ట ఇది కనిపెట్టి తెరచి ఉన్న మొసలి నోటిలో నిర్భయంగా ప్రవేశించి మెత్తని చోట్ల పట్టివున్న జలగల్ని పొడిచి తినేస్తుంది. మొసలి ఈపిట్టకి హాని చెయ్యదు.

* *Cambridge Natural History Vol VIII Page 462.*

★

**బహుమతి రు. 500**
(గవర్నమెంటు రిజిష్టర్డు)
**తెల్ల వెండ్రుకలను పోగొట్టును**
రంగులనుచూచి మోసపోవద్దు అది తాత్కాలికము మా సువాసనగల "మహా మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారై 60 సం॥ వయస్సువరకు వెంట్రుకలను నల్లగావుంచును ఇదిగాక మెదడుకు బలవనిచ్చును "ఉన్మాదము, తలనొప్పి" వగైరా జబ్బులరానీయదు "జ్ఞాపకశక్తి"ని కంటి చూపును వృద్ధిచేయును కొద్దిగా నెరిసివుంటే ఒక సీసా రూ 2-8-0 3 సీసాలు రూ 9-0-0 సగము నెరిసివుంటే, ఒకసీసా రూ 5-0-0 3 సీసాలు రూ 12/-పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రూ 7/- 3 సీసాలు రూ 18/- ఇది పని చేయదని నిరూపించిన రూ 500/-
INDRA LABORATORIES,
P. O. Raj Dhanwar (H, Bhag)

**గానకళాబోధిని**
గొప్ప సంగీత గ్రంథము. చిన్నలు పెద్దలకు గవర్నమెంటు పరీక్షలకు ఉపయోగపడును సుమారు 600 పేజీలు గల పుస్తకము వెల 10-0-0 పోస్టేజి వేరు
బాలసరస్వతి బుక్ డిపో కర్నూలు

చదవండి / తెలుగు మాస పత్రిక
**జయభారతి**